దైవదర్శనం క్యూలైన్‌లో భక్తులు

యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట, మే 22: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ కొనసాగింది. స్వామివారి జయంత్యోత్సవాల ముగింపుతో పాటు వేసవి సెలవు ముగుస్తుండటంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తిరుమాఢవీధులు, క్యూ కాంప్లెక్స్ భక్తులతో సందడిగా మారింది. సుమారు 28 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. నమ్మాళ్వారు తిరునక్షత్రోత్సవం అత్యంత వైభవంగా సాగింది. అనంతరం తిరుమాఢవీధుల్లో పురప్పాట్ సేవను నిర్వహించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖాజానాకు రూ. 35,64,770 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

స్వామివారి జయంత్యోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మల్లాపురంకు చెందిన రామ భక్త భజన మండలి, యాదగిరిగుట్టకు చెందిన శ్రీయాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి మహిళా భజన మండలి వారు భజన కార్యక్రమాలు, ఉమ్మడి లక్ష్మణాచార్య ఆధ్వర్యంలో భక్తి సంగీతం, కౌముది నృత్యాలయం, ప్రణుతి ఆదర్శిని, శ్రీమయూరి నాట్య కళాసాధన వారితో కూచిపూడి నృత్యం, ముంబాయికి చెందిన మధురధ్వని బృందంచే శాస్త్రీయ సంగీతం, నృత్య ప్రదర్శన నిర్వహించారు.

రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి

- ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం


పైవేటు కళాశాల ప్రిన్సిపాల్‌ను కలిసి ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భువనగిరి అర్బన్, మే 22: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, న్యాయవాదులను కలిసి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రభుత్వాన్ని నిలదీసే బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాల కోసం, ప్రైవేటు డిగ్రీ కళాశాలల సమస్యల పరిష్కారం కోసం, పెండింగ్ స్కాలర్‌షిప్‌ల విడుదల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకను పెద్దల సభకు పంపాలన్నారు. విద్యావంతుడైన రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఏవీ. కిరణ్‌కుమార్, నాయకులు బబ్లూ, ఇస్మాయిల్, బర్రె రమేశ్, సూరజ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు అరుణ

మహిళలకు ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

ఆత్మకూరు(ఎం), మే 22 : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని బీఆర్ఎస్ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు సోలిపురం అరుణా ఉపేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన మహిళా పట్టభద్రుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.2500 ఇస్తానని, కల్యాణలక్ష్మి పథకం ద్వారా రూ.లక్షతో పాటు తులం బంగారం అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, కానీ ఇప్పటి వరకు అమలు చేయడం లేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన ప్రభుత్వం బస్సుల సంఖ్యను పెంచక పోవడంతో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎంపీటీసీ యాస కవిత, రైతుబంధుసమితి జిల్లా మాజీ డైరెక్టర్ బీసు ధనలక్ష్మి, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షురాలు నాయిని శశికళ, మహిళా విభాగం గ్రామశాఖ అధ్యక్షురాలు తవిటి పద్మ, జయశ్రీ, రమాదేవి, రాములమ్మ పాల్గొన్నారు.

జూన్ 1లోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తాం

అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

భువనగిరి కలెక్టరేట్, మే 22 : జూన్ 1లోగా ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేస్తామని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్ అన్నారు. బుధవారం ఆయన జిల్లాలో ధాన్యం కొనుగోళ్లపై మాట్లాడారు. జిల్లాలో 323 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 2,82,330 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. 77 సెంటర్లలో కొనుగోళ్లు పూర్తి కాగా వాటిని మూసివేశామని, మిగతా 246 కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రతిరోజూ 320 లారీల ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నట్లు చెప్పారు. ధాన్యం కొనుగోళ్లకు ఇబ్బంది లేకుండా హన్మకొండ జిల్లాకు 10 వేల మెట్రిక్ టన్నులు, జనగాం జిల్లాకు 40 వేల మెట్రిక్ టన్నులు, రంగారెడ్డి జిల్లాకు 10 వేల మెట్రిక్ టన్నులు, నల్లగొండ జిల్లాకు 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అక్కడి మిల్లులకు పంపిస్తున్నట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల్లోని హమాలీలను ఇతర కేంద్రాలకు పంపించి ధాన్యం త్వరగా మిల్లులకు తరలిస్తున్నట్లు చెప్పారు. జిల్లా సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, వ్యవసాయ శాఖ, మండల స్పెషల్ ఆఫీసర్లు, బృందాల పర్యవేక్షణలో కొనుగోళ్లు వేగంగా జరుగుతున్నాయని, వ్యవసాయ అధికారులు ధాన్యం నాణ్యతను పరీక్షించి గ్రేడింగ్ సర్టిఫికెట్స్ ఇవ్వాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే రైతులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యం తీసుకొచ్చేలా అవగాహన కల్పించాలని సూచించారు. 400 మెట్రిక్ టన్నుల తడిసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించామని, కొనుగోలు కేంద్రాల్లో 4 వేల టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని, మరో వెయ్యి టార్పాలిన్లు పంపిస్తామని చెప్పారు. గన్నీ బ్యాగుల కొరత లేదని, మిల్లర్లతో తరచూ సమావేశమై అన్‌లోడింగ్ సమస్యలు రాకుండా చూసుకోవాలని, లారీలను త్వరగా పంపాలని, అవసరమైతే ప్రైవేట్ గోదాముల్లో స్టోరేజీ ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో

ఇంకా 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం లిఫ్ట్ చేయాల్సి ఉందని తెలిపారు.

అభివృద్ధి పనులు నెలాఖరులోపు పూర్తి చేయాలి

- ప్రత్యేకాధికారి శ్యామ్‌సుందర్

పనులు పరిశీలిస్తున్న నోడల్ అధికారి రోజారాణి

తుర్కపల్లి,మే 22 : మండల కేంద్రంతో పాటు మాదాపురం, మల్కాపురం, కేసీయాతండా గ్రామాల్లోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి శ్యామ్‌సుందర్ ఆదేశించారు. బుధవారం ఆయా పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. పాఠశాలల్లో తాగునీటి వసతి, మూత్రశాలలు, విద్యుత్‌సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ జాన్సీలక్ష్మీబాయి, ఏఈ అమరేందర్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

బొమ్మలరామారం : మండల కేంద్రంతో పాటు పెద్దపర్వతాపూర్ ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం మండల నోడల్ అధికారి రోజా రాణి తనిఖీ చేశారు. పనులు నాణ్యతో చేయాలని సూచించారు.

సీపీఐ మండల కార్యదర్శికి కూనంనేని పరామర్శ


రాములును పరామర్శిస్తున్న కూనంనేని సాంబశివరావు

భువనగిరి కలెక్టరేట్, మే 22 : అనారోగ్యంతో బాధపడుతున్న సీపీఐ భువనగిరి మండల కార్యదర్శి ముదిగొండ రాములును బుధవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పరామర్శించారు. మండలంలోని బస్వాపురం గ్రామంలోని ఆయన ఇంటికి వెళ్లిన కూనంనేని రాములు కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. రాములుకు, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్, భువనగిరి ఎంపీపీ నరాల నిర్మల, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వస్తువుల అభిలాశ్, పార్టీ పట్టణ కార్యదర్శి పుట్ట రమేశ్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి లక్ష్మయ్య, నాయకులు ఉడుత రాఘవులు, చిక్క భిక్షపతి, మరిపెల్లి రాములు, సోమన ఐలయ్య, చింతల మల్లేశం, కార్యకర్తలు ఉన్నారు.

రాజపేట నుంచి సికింద్రాబాద్‌కు ఆర్టీసీ బస్సు

రాజాపేట, మే 22 : సిద్దిపేట నుంచి సికింద్రాబాద్ వరకు వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసును బుధవారం నర్సాపురంలో మాజీ సర్పంచ్ నాగిర్తి గోపిరెడ్డి ప్రారంభించారు. సిద్దిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మధ్యాహ్న 2:30 గంటకు డిపోలో బయల్దేరి సాయంత్ర 3:30 గంటలకు రాజాపేటకు చేరుకుంటుందని, అక్కడి నుంచి నర్సాపురం జగదేవ్‌పూర్ మీదుగా సాయంత్ర 6 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుందని అధికారులు తెలిపారు. సాయంత్రం సికింద్రాబాద్ నుంచి అదే రూట్లో ప్రయాణిస్తూ కొమురవెల్లికి చేరుకొని నైట్‌హాల్ట్ చేస్తుంది. అనంతరం మరుసటి రోజు ఉదయం 5 గంటలకు బయల్దేరి రాజాపేట మీదుగా సికింద్రాబాద్‌కు, తిరుగు ప్రయాణంలో సిద్దిపేట డిపోకు 11:30 గంటలకు చేరుకుంటుంది. ఇలా రోజుకు రెండు ట్రిప్పులు తిరుగుతుందని, ప్రయాణికులు ఆర్టీసీ బస్సు సేవలను వినియోగించుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

- సబ్ స్టేషన్‌కు తాళం వేసి కుటుంబ సభ్యుల ఆందోళన

సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

గుండాల, మే 22: మండల కేంద్రంలో విద్యుత్ తీగలు సరిచేసే పనులు చేపడుతున్న జూనియర్ లైన్‌మెన్ బాలకృష్ణ, హెల్పర్ మధు బుధవారం మండల కేంద్రానికి చెందిన రోజువారి కూలీ అయిన అన్నెపర్తి ప్రవీణ్‌ను స్తంభం ఎక్కించారు. అయితే ఎల్‌సీ తీసుకోకుండా విద్యుత్ స్తంభం ఎక్కడంతో ప్రవీణ్‌కు విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. దాంతో ట్రాన్స్‌కో అధికారులు ప్రవీణ్‌ను హుటాహుటిన స్థానిక ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. విషయం తెలుసుకున్న ప్రవీణ్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సబ్ స్టేషన్‌కు తాళం వేసి ఆందోళన చేపట్టారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో గాయపడిన ప్రవీణ్‌కు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ యాకన్న బందోబస్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న ఏడీ బాలూనాయక్ ఆందోళనకారుల వద్దకు వచ్చి ప్రవీణ్ వైద్యానికయ్యే ఖర్చులు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏడీ బాలూనాయక్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎండీ. ఖలీల్, సీపీఎం మండల కార్యదర్శి మద్దెపురం రాజు, నాయకులు అన్నెపర్తి యాదగిరి, కొడపర్తి భాస్కర్, అన్నెపర్తి గిరిబాబు, అన్నెపర్తి ఉపేందర్, నల్ల నర్సయ్య, ఎలికట్టే మల్లయ్య, అన్నెపర్తి రాజు, పరషురాములు, సైదులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

గుండాల, మే 22: మండలంలోని వెల్మజాల గ్రామంలో నిర్మిస్తున్న శంభులింగేశ్వరాలయ పునఃనిర్మిణామం కోసం బుధవారం తుర్కలశాపూరం గ్రామానికి చెందిన పెద్దగొల్ల ఉప్పుల రాము యాదవ్ రూ.51 వేల విరాళం అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దాచ ప్రసాద్‌గుప్తా, మాజీ ఎంపీపీ

సంగి వేణుగోపాల్‌యాదవ్, మాజీ సర్పంచ్ సంగి బాలకృష్ణ ఉన్నారు.

నేడు మోత్కూరులో పట్టభద్రుల సమావేశం

మోత్కూరు, మే 22 : మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పట్టభద్రుల సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల, మున్సిపాలిటీ అధ్యక్షులు పొన్నెబోయిన రమేశ్, జంగ శ్రీనులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. పట్టభద్రులు, పార్టీ ముఖ్య నాయకులు హాజరు కావాలని కోరారు.

'చెరువుమట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి'

తుర్కపల్లి, మే 22 : మండలంలోని వేల్పుపల్లి గ్రామ పెద్దమ్మల చెరువు, గొర్రెంకల చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ ఉప సర్పంచ్ ఎరుకల వెంకటేశ్ గౌడ్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడు రోజులుగా చెరువుల్లోని మట్టిని జేసీబీలతో తోడి ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్నారని, దాంతో చెరువుల్లో పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయని తెలిపారు. సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు.

బైక్‌ను కారు ఢీకొని తండ్రీ కూతుళ్లకు గాయాలు

భువనగిరి అర్బన్, మే 22: కారు బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన గంగదేవి శ్రీనివాస్, కూతురు అనుశ్రీతో కలిసి బైక్‌పై హైదరాబాద్‌కు బయల్దేరాడు. పట్టణ పరిధిలోని చెరువు కట్ట సమీపంలో ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. దాంతో శ్రీనివాస్, అనుశ్రీకి గాయాలయ్యాయి. స్థానికులు వారిని భువనగిరి ఏరియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.అరుణ్‌కుమార్ తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని వినతి

రాజాపేట, మే 22 : ఐకేపీ కేంద్రాలల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరుతూ సీపీఐ నాయకులు బుధవారం తాసీల్దార్ దామోదర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ధాన్యానికి రూ. 500 బోనస్ చెల్లించాలని, రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, సబ్సిడీపై విత్తనాలు అందించాలని కోరారు. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చిగుళ్ల లింగం, నాయకులు ఒగ్గు కరుణాకర్, మూల పోశయ్య, దస్తగిరి, సోమిరెడ్డి, కరుణాకర్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి

బొమ్మలరామారం : మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన గజ్జెల్లి అశోక్ ఇటీవల ఆనారోగ్యం మరణించాడు. అతడి స్నేహితులు బుధవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు అందించారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, రవి, రంజిత్ కుమార్, సత్యనారాయణ, ప్రభాకర్ రెడ్డి, పాండు పాల్గొన్నారు.

25న చౌటుప్పల్ మండల సర్వసభ్య సమావేశం

చౌటుప్పల్, మే 22 : ఈ నెల 25న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సందీప్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

పదవీ వ్యామోహంతోనే అవిశ్వాస ప్రతిపాదన

- రైతు సేవా సహకార సంఘం చైర్మన్ అశోక్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న సంఘం చైర్మన్ అశోక్‌రెడ్డి

మోత్కూరు, మే 22 : కాంగ్రెస్ పార్టీకి చెందిన డైరెక్టర్లు పదవీ వ్యామోహంతోనే తనపై అవిశ్వాస ప్రతిపాదన చేశారని మోత్కూరు రైతు సేవా సహకార సంఘం చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డి అన్నారు. బుధవారం సంఘం కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం సమావేశాల్లో పాలకవర్గం చేసిన తీర్మానం మేరకే రూ.65లక్షల అంచనా వ్యయంతో సంఘం ఎదురుగా మెయిన్ రోడ్డు వెంట షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రూ.42.65 లక్షల పని జరిగిందని, ఇందుకోసం అధికారులు రూ.39.13లక్షలను డ్రా చేసి స్టీలు, సిమెంట్, ఇసుక, కంకర, ఇటుక కోసం చెల్లించారని పేర్కొన్నారు. తాను రూ.50లక్షలు డ్రా చేసినట్లు సంఘం వైస్ చైర్మన్ వెంకటేశ్వర్లు, కొంత మంది డైరెక్టర్లు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. దత్తప్పగూడెంలో మెయిన్ రోడ్డు వెంట కంచర్ల భగవంతరెడ్డి భూమిలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశామని, భూమికి అద్దె రూపంలో నెలకు రూ.10 వేలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. సంఘానికి చెందిన రూ.1.10 కోట్లు ఎఫ్‌డీల ద్వారా వచ్చే వడ్డీతో ఉద్యోగుల జీతభత్యాలు, రైతులకు ఎరువులు, విత్తనాలు, చిరువ్యాపారులకు రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సంఘం ద్వారా ధాన్యం కొనుగోలు చేసిన మూడేండ్ల కమిషన్ రూ.46లక్షలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందన్నారు. సహకార సంఘ చట్టం సెక్షన్(21బి) ప్రకారం వరుసగా సంఘం సమావేశాలకు హాజరు కానీ సభ్యుల సభ్యత్వం రద్దు చేసే అధికారం చైర్మన్‌కు ఉందని, దాని ప్రకారమే బయ్యని చంద్రశేఖర్, ఆకుల వెంకటేశ్వర్లు సభ్యత్వాన్ని తొలగించి డీసీఓకు నివేదించినట్లు చెప్పారు. తాను అవినీతి రహితంగా పాలన సాగించి సంఘం బలోపేతానికి కృషి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో కొంత మంది డైరెక్టర్లు పదవీ వ్యామోహంతో కాంగ్రెస్‌లో చేరి రాజకీయ కుట్రకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో సంఘం డైరెక్టర్లు పురుగుల మల్లయ్య, సామ పద్మారెడ్డి, దేవసరి రాములు పాల్గొన్నారు.

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం

చౌటుప్పల్, మే 22 : చౌటుప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1983-84 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు బుధవారం స్థానిక ఎంఎస్ గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎండీ ఇస్మాయిల్, వీరమల్ల లక్ష్మీనారాయణ, స్వామిగౌడ్, ఉడుగు వెంకటేశం గౌడ్, పోలోజు భాస్కరాచారి, పాశం రఘుపతి, ఎస్‌కే. జానిపాషా, రాజపేట అశోక్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ మృతదేహంతో ఆందోళన

ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

యాదగిరిగుట్ట, మే22: మండలంలోని సాదువెల్లి గ్రామానికి చెందిన గోలి శ్రీనివాస్(32) మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు బుధవారం యాదగిరిగుట్టలోని సుభాశ్‌నగర్‌లో ఉన్న జిల్లా భరత్ ఇంటి ఎదుట ఆందోళన చేపట్టారు. శ్రీనివాస్(32) మంగళవారం బైక్‌పై యాదగిరిగుట్ట పట్టణానికి వెళ్తుండగా సైదాపురం గ్రామ శివారులో పట్టణానికి చెందిన జిల్లా భరత్ బైక్‌పై అతి వేగంగా వచ్చి ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దాంతో గ్రామస్తులు మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతదేహంతో ఆందోళనకు దిగారు. గ్రామంలో మగ్గం పని చేసుకుంటూ జీవనం సాగించే శ్రీనివాస్ మృతి చెందడంతో భార్య, ముగ్గురు పిల్లలు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వారితో మాట్లాడారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో బాధితులు ఆందోళన విరమించారు. అనంతరం శ్రీనివాస్ మృతదేహాన్ని గ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

ఉపాధ్యాయుల పదోన్నతులు చేపట్టాలి : టీఎస్ యూటీఎఫ్

మోత్కూరు, మే 22 : ఉపాధ్యాయుల ప్రమోషన్లకు సంబంధించి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చినందున ప్రభుత్వం వెంటనే ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి అన్నారం సత్తయ్య కోరారు. బుధవారం సంఘం ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల డీఏ బకాయిలను చెల్లించాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు దునుక సోమేశ్వర్, దడిపల్లి శ్రీనివాస్, దోర్నం వెంకన్న, గుండా మల్లేశం పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు డీసీసీబీ చైర్మన్ పరామర్శ

మృతురాలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న గొంగిడి మహేందర్‌రెడ్డి

ఆలేరురూరల్, మే 22 : ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని బహదూర్‌పేట మాజీ సర్పంచ్ జంపాల దశరథ సతీమణి సుజాత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి బుధవారం సుజాత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, కౌన్సిలర్ రాయపురం నర్సింహులు, బీఆర్ఎస్ నాయకులు కుండె సంపత్, వస్పరి మల్లేశ్, దయ్యాల సంపత్ ఉన్నారు.

న్యాయం కోసం భర్త ఇంటి ముందు వంటావార్పు

భర్త ఇంటిఎదుట నిరసన తెలుపుతున్న భాను

రాజాపేట, మే 22 : ప్రేమించి పెండ్లి చేసుకొని మోసం చేశాడని, తనకు న్యాయం చేయాలని కోరుతూ భర్త ఇంటి ఎదుట భార్య వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపిన ఘటన మండలంలోని బూర్గుపల్లిలో బుధవారం జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ రామాంతాపూర్‌కు చెందిన రేకులపల్లి భాను, రాజాపేట మండలంలోని బూర్గుపల్లికి చెందిన రేకుల మహిపాల్‌రెడ్డి ప్రేమించుకొని 2021లో సింహాచలంలో వివాహం చేసుకున్నారు. భాను కుటుంబ సభ్యులు కట్నం కింద 24 తులాల బంగారం, రూ.70 లక్షల నగదు అందించారు. ఇద్దరూ నాగోల్‌లో కొంత కాలం, బోడుప్పల్‌లో కొన్ని రోజులు ఇల్లు అద్దెకు తీసుకొని నివాసమున్నారు. గతేడాది బోనాల పండుగ సందర్భంగా భానును తల్లిగారింటికి వెళ్లమని చెప్పి పంపించిన మహిపాల్‌రెడ్డి ఆ తర్వాత కనిపించకుండా పోయాడు. భర్త కోసం సంవత్సరం పాటు ఎదురు చూసిన భాను అతను తన వద్దకు రాక పోవడంతో న్యాయం చేయాలని కోరుతూ బూర్గుపల్లిలో భర్త ఇంటి ఎదుట బైఠాయించింది. వంటావార్పుతో నిరసన చేపట్టింది. మండుటెండలో నిరసన తెలుపుతున్న భాను కుటుంబ సభ్యులకు ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ మోత్కుపల్ల